క్లుప్తంగా

పెనుమత్స విజయంపై హర్షం

నెల్లిమర్ల రూరల్: శాసనమండలి సభ్యుడిగా డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఎన్నికవ్వడం సంతోషాన్ని కలిగించిందని టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా మొయిద విజయరామపురం గ్రామంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేష్‌బాబుకు రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీనివాసరావు, తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

నెల్లిమర్ల రూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా డిపో మేనేజర్ దుర్గ కొండ వెలగాడలోని బంగారమ్మను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆర్టీసీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బస్సులు నడిపి ఆర్టీసీ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని బంగారమ్మ సూచించారు.

మురుగునీటితో ఇక్కట్లు



సీసీ రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న మురుగు నీరు

విజయనగరం: నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల ఐనాక్స్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న కాలనీవాసులు మురుగునీటితో అవస్థలు పడుతున్నారు. కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డు మీదుగా మురుగునీరు ప్రవహిస్తుండడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు, అటుగా ప్రయాణించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మార్కండేయులు

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త మార్కండేయులు అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో వంద మంది పేదలకు బియ్యం, గోధుమనూక, నూనె వంటి నిత్యావసర వస్తువులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు చేయూతనివ్వడంలోనే నిజమైన సంతృప్తి ఉందన్నారు. సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని పేదల కోసం ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక



స్కాలర్ షిప్‌కు ఎంపికైన మెట్టపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు

చీపురుపల్లి రూరల్: జాతీయ ఉపకార వేతనాలకు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) మండలంలోని మెట్టపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు దన్నాన చరణ్ తేజ్, మీసాల ప్రసన్న, తామరపు తేజ, పెదనడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని మీసాల హరిణి ఎంపికయ్యారు. ఉపకారవేతనాల కోసం నిర్వహించిన పరీక్షలో ఈ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆదివారం చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేయనుందని తెలిపారు.

40 ఎకరాల్లో పంట నష్టం

బొండపల్లి: ఇటీవ ఈదురుగాలులతో కురిసిన వర్షాలకు మండలంలోని ముద్దూరు గ్రామంలో 40 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని ఏఓ పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. పలు గ్రామాల్లో 150 ఎకరాల్లో పంటనేలకొరగగా అందులో 33 శాతానికి మించి దెబ్బతిన్న పంట విస్తీర్ణం 40 ఎకరాల వరకు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 43,870 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు ఆదివారం రాత్రి తెలిపారు. మండల పరిధిలోని గొల్లలపేట గ్రామ శివారు ప్రాంతాల్లో పేకాటాడుతున్న వారిని పట్టుకుని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

రూపురేఖలు మారాయ్...

- పాఠశాలల అభివృద్ధికి 'నాడు – నేడు' నిధులు
- కోట్లాది రూపాయలు వెచ్చించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



సుందరంగా రూపుదిద్దుకున్న సుంకరిపేట పాఠశాల ప్రాంగణం

విజయనగరం రూరల్: పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తే సమాజానికి మెరుగైన విద్యార్థులను అందించవచ్చనే తలంపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మూడేళ్ల కిందటే 'నాడు – నేడు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంతో పాఠశాలల రూపురేఖలు మారాయి. నియోజవర్గ పరిధిలో తొలివిడతలో 43 పాఠశాలలను నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేయగా... రెండో విడతలో 51 పాఠశాలలను అభివృద్ధి చేశారు.

టీడీపీ హయాంలో దయనీయం..

2019 సంవత్సరానికి ముందు తెలుగుదేశం పాలనలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉండేది. చాలీచాలనీ తరగతి గదులు, తాగునీటి సమస్యతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్నో అవస్థలు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన మరుగుదొడ్లు ఏడాది తిరిగేసరికే పాడయ్యాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. అసంపూర్తిగా మిగిలిన తరగతి గదులతో విద్యార్థులకు నేలమీద క్లాసులు చెప్పిన సంఘటనలున్నాయి. మండల పరిధిలోని పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేవి కావు. మరుగుదొడ్లకు వెళ్లాలన్నా పొలంగట్ల బాట పట్టాల్సిన పరిస్థితి ఉండేది. మధ్యాహ్న భోజనం వంటల నిర్వహణ తరగతి వరండాలోనే నిర్వహించేవారు. ప్రహరీలు లేక కుక్కలు, పశువులు పాఠశాలల ఆవరణలోనే తిష్ట వేసేవి.

'నాడు – నేడు' పనులకు రూ. 13.69 కోట్లు

'నాడు–నేడు' కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో నియోజకవర్గంలోని 43 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులకు 7,45,32,000 రూపాయలు మంజూరు చేశారు. అలాగే రెండో విడతలో 51 పాఠశాలలను ఎంపిక చేసి రూ. 6,23,51,000 మంజూరు చేసి అభివృద్ధి పనులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. కనీస సదుపాయాలు లేని స్థాయి నుంచి కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. అలాగే సురక్షిత తాగునీరు, అత్యాధునిక మరుగుదొడ్లు, వాటికి రన్నింగ్ వాటర్, గోడలపై విజ్ఞానాన్ని పెంచే బొమ్మలు, అదనపు భవనాలు, ప్రహరీలు వంటివి నిర్మించారు. సోలార్ విద్యుత్ సౌకర్యం, డిజిటల్ తరగతుల నిర్వహణతో పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, ఆధునిక హంగులతో బ్లాక్‌బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు పెంచుతూ ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేశారు.



సారిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు



పాఠశాలలో ఆధునిక వసతులతో నిర్మించిన మరుగుదొడ్లు



సారికలో సుందరంగా తీర్చిదిద్దిన తరగతి భవనం



సారిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ముఖద్వారం

'చలో పార్లమెంట్'ను విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: కార్మిక, కర్షక హక్కుల సాధనకు ఏప్రిల్ 5న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఏపీ మెడికల్ సేల్స్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యూఎస్ రవికుమార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకుడు రెడ్డి శంకరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోందని ఆరోపించారు. ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను కేంద్ర ప్రభుత్వం ఆదాని, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. కార్మికుల కు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.జగన్‌మోహన్, బి.రమణ, కార్మికులు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

రాంబర్కి సేవలు మార్గదర్శకం

విజయనగరం : నాటక రంగానికి, తెలుగు భాషా సేవా సంఘానికి రాంబర్కి రామానాయుడు చేసిన సేవలు భావితరాలకు మార్గదర్శకంగా ఉంటాయని శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు (సీహెచ్ రమణ) అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్ద ఆదివారం ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారుడు, కవి, గాయకుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకుడు రాంబర్కి రామానాయుడును క్లబ్ సభ్యులంతా ఘనంగా సత్కరించారు. అనంతరం రామానాయుడు కొన్ని పౌరాణిక, సాంఘిక ఘట్టాలను తనదైన శైలిలో నటనతో ప్రదర్శించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు ఆరిక తోట తిరుపతి రావు, తాడ్డి ఆదినారాయణ, వల్లూరి శ్రీనివాసరావు, ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, కోట్ల ఈశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ పైడయ్య, ఐవీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



రామానాయుడును సత్కరిస్తున్న సాయికృష్ణా వాకర్స్ క్లబ్ సభ్యులు

ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం

- ప్రపంచ ఆర్యవైశ్య సంఘ మహాసభలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: ఆర్య వైశ్యులకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, పదవుల్లో ఆర్య వైశ్యులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య సంఘం మహాసభను పురిటిపెంట గ్రామంలోని మారుతీ నగర్ వద్ద ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రపంచ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా, ఎమ్మెల్యే అప్పలనరసయ్య ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. మహాసభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామికి డిప్యూటీ స్పీకర్ పదవిని సీఎం కట్టబెట్టారని చెప్పారు. అన్ని రంగాల్లోను సముచిత స్థానం, అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

ఆర్య వైశ్యులకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అంతా ఐకమత్యంగా ఉండాలని, సమస్యలు ఏవైనా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నాయకులు జూలకంటి శ్రీనివాసరావు, మావుడి సత్యనారాయణ, పూసర్ల మోహనరావు, ఉప్పల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సైపై దౌర్జన్యం

విజయనగరం క్రైమ్: ట్రాఫిక్ ఎస్సై హరిబాబునాయుడుపై ఓ వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అందించిన వివరాలిలా ఉన్నాయి.. స్థానిక న్యూపూర్ణ థియేటర్ సమీపంలో పోలీసులు ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేస్తున్నారు. ఇదే సమయంలో పక్కనే మందు తాగుతున్న సోము గణేష్ అనే వ్యక్తి ఒక్కసారిగా ఎస్సై హరిబాబునాయుడిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు.

బాధిత ఎస్సై ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ పొదుపు పాటించాలి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఎర్త్ అవర్ కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ వాసులు, గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులంతా సేవ్ ఎర్త్, సేవ్ లైఫ్ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి మాట్లాడుతూ అవసరం లేనప్పుడు, రాత్రి సమయంలో చల్లగా ఉన్నప్పుడు విద్యుత్ బల్బులు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్లు ఆఫ్ చేసి విద్యుత్ పొదుపు పాటించాలని కోరారు.

రామభద్రపురం: ఎర్త్ అవర్ సందర్భంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. భూ పరిరక్షణే ధ్యేయంగా పర్యావరణంతో పాటు నేల, నీరు, గాలి కాలుష్యం కాకుండా చూడాలని, అలాగే నీటిని, విద్యుత్‌ను పొదుపు చేయాలని కోరారు. రాబోయే తరాల వారికి విద్యుత్ వెలుగులు ప్రసాదించేందుకు ఇప్పటినుంచే ప్రతిరోజూ రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఓ గంట పాటు విద్యుత్ ప్రసారం ఆపివేసి, విద్యుత్‌ను పొదుపు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు బి.రవికుమార్, జి.ముసలయ్య పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ ప్రకారమే నిధుల జమ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రకారమే లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు జమ చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, మెప్మా, వెలుగు శాఖల అధికారులతో ఆదివారం సమావేశమైన ఆయన ఈ ఏడాది వైఎస్సార్ ఆసరా పథకం కింద బొబ్బిలి మున్సిపాలిటీలోని దాదాపు 10 వేల మంది మహిళలకు రూ.5.76 కోట్లు, మండలంలోని 14 వేల మంది మహిళలకు రూ.8.02 కోట్ల నిధులు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి, సీఎం జగన్ సందేశం వినిపిస్తామన్నారు. మండల, పట్టణ పరిధిలోని అధికారులు, నాయకులు, డ్వాక్రా మహిలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ రేజేటి ఈశ్వరరావు(విసు), ఏపీఎం స్వామి, టీపీఆర్ఓ జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో రక్షణ..



భోగాపురంలో పశువులకు టీకాలు వేస్తున్న సచివాలయ పశువైద్య సహాయకులు

- పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
- రైతులు వినియోగించుకోవాలి : పశు వైద్యులు

భోగాపురం: వాతావరణ మార్పుల నేపథ్యంలో వివిధ రకాల వ్యాధుల నుంచి పశువులకు రక్షణ కల్పించేందుకు టీకాలు ఎంతో ఉపయోగపడతాయని పశు వైద్యనిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాపిస్తోంది. ఈ వ్యాధి కారణంగా పాలు తగ్గిపోవడం, పశువు ఆరోగ్యం బాగా క్షీణించడంతో పాటు ఒక్కోసారి మృతి చెందుతుంది. ఈ నేపథ్యంలో విలువైన పశువులను కాపాడుకోవాలంటే గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయడం ఒక్కటే మార్గం.

టీకాలు ఉచితం..

పశు సంపదను రక్షించుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సినేషన్ చేపడుతోంది. మార్చి ఒకటి నుంచి దశల వారీగా జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులకు టీకాలు వేస్తున్నారు. కలెక్టర్ సూర్యకుమారి పర్యవేక్షణలో పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది పక్కా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి పశువుకు వాక్సిన్ అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు.

40,428 డోసులు..

నెల్లిమర్ల నియోజకవర్గంలో పశు సంపద గణన వివరాలు ఇప్పటికే సంబంధిత సిబ్బంది సేకరించారు. వీటి ప్రకారం నియోజకవర్గంలో ఆవులు 50,060, గేదెలు 6,090 కలిపి మొత్తం 56,150 పశువులు ఉన్నాయి.వీటిలో 90 శాతం పశువులకు వాక్సినేషన్, 10 శాతం వాటికి బూస్టర్ డోస్ అందించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుత సీజన్‌లో దాదాపు 50,150 డోసులు అందించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 40,428 డోసులను పశువులకు అందించారు.

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు పశుపోషణను అదనపు ఆదాయంగా పరిగణిస్తారు. వాటికి ఏమైనా వ్యాధులు సోకితే తీరని నష్టం ఏర్పడుతుంది. పశువులను కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలి. గాలికుంటు వ్యాధి టీకా డోసు ఖరీదు వంద రూపాయలు కాగా.. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఉమాశంకర్ మహాపాత్రో, ఏరియా పశువైద్య సహాయ సంచాలికుడు, భోగాపురం

నటుల సంకల్పంతోనే నాటక పునరుజ్జీవం

రాజాం సిటీ: నటులు సంకల్పిస్తే నాటకం పునరుజ్జీవం దాల్చుతుందని ప్రముఖ పండితుడు, కవి నేతేటి గణేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో జరిగిన రాజాం రచయితల వేదిక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన 'కాళ్లకూరి వారి కమనీయ దృశ్య కావ్యాలు' అనే అంశంపై కాసేపు ప్రసంగించారు. రచయిత కాళ్లకూరి నారాయణరావు రాసిన నాటకాలతో తెలుగు సమాజంలో సంఘ సంస్కరణ భావాలు ప్రచారంలోకి వచ్చాయన్నారు. చారిత్రక కథలను తన కాలంనాటి సంఘ ప్రయోజనానికి సాంఘిక నాటకాలుగా మలిచి రచించిన గొప్ప రచయిత నారాయణరావు అని కొనియాడారు. అనంతరం వేదిక సభ్యులు గణేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో వేదిక నిర్వాహకులు గార రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

రామాలయాల నిర్మాణానికి శంకుస్థాపన

చీపురుపల్లిరూరల్: మండలంలోని రావివలస, ముల్లుపేట, ఆర్థివలస, దేవరాపొదిలాం గ్రామాల్లో రామాలయాల నిర్మాణానికి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి ఆయా గ్రామాల పెద్దలతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలతో ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ నుంచి ఒక్కో రామాలయ నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున నిధులను మంజూరు చేసిందని చెప్పారు. ఇదివరకు ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాల నిర్మాణాలకు నిధులను మంజూరు చేస్తున్నారని అన్నారు. గ్రామ పెద్దలు, యువత అంతా ఐక్యతతో ఆలయ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దన్, కరిమజ్జి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, రామలింగాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, కర్లాం పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఆయా పంచాయతీల సర్పంచులు రఘుమండ రమణమ్మ, చందక సాయమ్మ, ఎంపీటీసీలు అధికార్ల శ్రీనివాసరావు, మీసాల ఈశ్వరరావు, కొమ్ము పద్మజ, ఆయా పంచాయతీల ఉప సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



రావివలసలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి



వేపాడ: సోంపురంలో దక్షిణ కాళీమాత అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా గ్రామదేవతల పండగ

వేపాడ: మండలంలోని వీలుపర్తిలో గ్రామదేవత పైడితల్లమ్మ, సోంపురంలో దక్షిణ కాళీమాత అమ్మవార్ల పండగను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు భక్తులు పసుపు, కుంకమ, చీరలతో మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోంపురంలో సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ అకుల సత్యనారాయణ తదితరులు దక్షిణ కాళీమాత అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు బంగారమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ

మెరకముడిదాం: మండలంలోని పెదమంత్రిపేటలో గ్రామ దేవత బంగారమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ, కలశ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామని, గ్రామానికి చెందిన భక్తులతో పాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

దిగ్విజయంగా ఏడాది పూర్తి..

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అన్న సమారాధాన కార్యక్రమం దిగ్విజయంగా ఏడాది పూర్తి చేసుకుందని దేవస్థానం చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ చెప్పారు. అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధాన కార్యక్రమాన్ని ఎంపీటీసీ ఇప్పిలి సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది అమ్మవారి 24వ జాతర మహోత్సవాలు పూర్తి చేసుకున్న తరువాత తొలి ఆదివారం నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభించామన్నారు. అప్పటినుంచి దాతల సహ కారంతో ప్రతీ ఆదివారం కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని, వందలాది మంది భక్త లు అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దేవస్థానం ఈఓ జి.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు వంకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: వీలుపర్తిలో పైడితల్లమ్మ ఆలయానికి వెళుతున్న భక్తులు